

# శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- మొదటి రోజు శైలపుత్రి అవతారంలో దర్శనం
- అమ్మవారికి బంగారు ముక్కుపుడక విరాళం
- నేడు బ్రహ్మచారినిగా దర్శనం ఇవ్వనున్న అమ్మవారు

బాసర, అక్టోబర్ 3 : బాసరలో గురువారం నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం అమ్మవారి క్షేత్రంలో అభిషేకం అనంతరం ఘట స్థాపనతో అమ్మవారిని ప్రతిష్టించి అర్చకులు ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం 4 గంటలకు ఆలయ అర్చకులు, వేద పండితులు అమ్మవారికి అభిషేకం నిర్వహించిన అనంతరం ఆలయ చైర్మన్ శరత్‌పాఠక్ , ఈవో విజయరామారావు కలశ స్థాపన పూజ చేసిన అనంతరం ఘట స్థాపన పూజ నిర్వహించారు. ఆలయంలో గణపతి, కలశ, చతుషష్టి పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి అనుమతి కల్పించారు. శైలపుత్రి అవతారంలో పూజలు అందుకున్న అమ్మవారికి ఆలయ అర్చకులు నైవేద్యంగా కట్టె పొంగలి సమర్పించారు. భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. ప్రారంభోత్సవ పూజల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా.. రెండో రోజైన శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణి అవతారంలో దర్శనం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా బాసర మాజీ సర్పంచ్ దయాల లక్ష్మణ్ రావు అమ్మవారికి తులం బంగారు ముక్కు పుడకను బహూకరించారు.

◄ శైలపుత్రి అవతారంలో అమ్మవారు

# సన్నాల కొనుగోళ్లలో సూక్ష్మ శోధన

## బియ్యాన్ని గుర్తించేందుకు పరికరాల కొనుగోళ్లు



- క్యాలీఫర్స్ కోసం ఇండెంట్ పంపిన అధికారులు
- చర్చనీయాంశంగా మారిన ప్రభుత్వ నిర్ణయం
- మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోళ్ల ప్రక్రియ
- బోనస్‌పై ఆందోళనకు గురవుతున్న అన్నదాత
- విధి విధానాలపై స్పష్టత లేకపోవడంతో గందరగోళం

నిర్మల్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ) : అన్నదాతకు అభయమిచ్చే 'చేయి' కనిపించడం లేదు. నిన్న, మొన్నటి వరకు సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు విధివిధానాలను ఖరారు చేయలేదు. ఒకవేళ బోనస్ ఇచ్చినా కొర్రీలు పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనేక రకాల పరీక్షలు పెట్టి సూక్ష్మ శోధన చేసేందుకు ప్రభుత్వ పెద్దలు కుట్ర చేస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ సర్కారు సన్నరకాలకు ఇవ్వాలనుకుంటున్న బోనస్ నుంచి తప్పించుకునేందుకు రకరకాల ఎత్తుగడలు వేస్తున్నది. ఇందులో భాగంగానే సనరకం వడ్ల పరిమాణాన్ని లెక్కించేందుకు క్యాలీఫర్(సూక్ష్మ పరిమాణాన్ని లెక్కించే ఒక రకమైన స్కేలు) పరికరాలను పెద్ద ఎత్తున కొనుగోలు చేయాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 228 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ఈ క్యాలీఫర్లను అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. క్యాలీఫర్ల కోసం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ పంపినట్లు సమాచారం. నిర్ధిష్టమైన పరిమాణంలో ధాన్యం గింజ ఉంటేనే రూ.500 బోనస్ చెల్లించే అవకాశం ఉన్నది. సాధారణంగా రైతులు సన్న రకాలే వేసినప్పటికీ ఒక్కో ప్రాంతంలో అక్కడి వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, సీడ్ కారణంగా గింజ పరిమాణంలో కొద్దిపాటి తేడాలు ఉండే అవకాశం ఉంది. ఇలాంటి చిన్నచిన్న కారణాలను చూపి బోనస్ నుంచి తప్పించుకునేందుకే ప్రభుత్వం క్యాలీఫర్స్ వంటి సూక్ష్మ కొలతల పరికరాలను తెర మీదికి తెస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

### బోనస్‌పై స్పష్టత కరువు

గత యాసంగిలో బోనస్ ఇవ్వకుండా ఎగవేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ వానకాలంలోనైనా ఇస్తుందో లేదో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇప్పటి వరకు బోనస్‌పై విధివిధానాలు ఖరారు కాకపోవడం గందరగోళానికి కారణమవుతున్నది. బోనస్‌పై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకున్నది. ఈసారి జిల్లాలో 1.35 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. 62,370 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఒకవేళ ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోతే మళ్లీ దళారులనే ఆశ్రయించాల్సి వస్తుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వానకాలం పెట్టుబడి సాయాన్ని అందించకుండా అన్నదాతను ఆగం చేసిన కాంగ్రెస్ సర్కారు.. మరోసారి బోనస్ పేరిట రైతులను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు.




ఇసుకను పట్టడానికి ఏర్పాటు చేసిన జాలి

బేల మండలంలోని కాంగార్‌పూర్ పెన్‌గంగా వద్ద ఇసుక తీసేందుకు ఉపయోగిస్తున్న జేసీబీ

నది నుంచి ఇసుకను తీయడానికి ఉపయోగించే పడవ

# నిండుగా నీళ్లు.. పడవలతో ఇసుక వెలికితీత

## పెన్‌గంగా నుంచి అక్రమ రవాణా

- బేల మండలం నుంచి మహారాష్ట్రకు తరలింపు
- నదిలో జాలి, జేసీబీ, టిప్పర్ ఏర్పాటు..
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా తవ్వకాలు
- డబుల్ సంపాదనతో అక్రమార్కుల దందా

*ఆదిలాబాద్, అక్టోబర్ 3(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. అక్రమార్జనకు అలవాటు పడిన దళారులు అనుమతులు లేకుండా టిప్పర్లలో భారీగా ఇసుకను తరలిస్తున్నారు. వర్షాల కారణంగా పెన్‌గంగలో భారీగా ఇసుక పేరుకు పోయింది. జిల్లాలో పెన్‌గంగా భీంపూర్, జైనథ్, బేల మండలాల్లో ప్రవహిస్తున్నది. ఏటా నదిలో నీటి ప్రవాహం తగ్గిన తర్వాత ఇసుకను తరలిస్తారు. ఈ ఏడాది ఇసుక రవాణాలో సాంకేతిక పద్ధతులను ఉపయోగించి, నదిలో నీరు నిల్వ ఉండగానే ఇసుకను బయటకు తీస్తున్నారు. బేల మండలంలోని కాంగార్‌పూర్ వద్ద పెన్‌గంగా నుంచి రోజు రాత్రి టిప్పర్లలో ఇసుకను మహారాష్ట్రకు రవాణా చేస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు.*

### పడవలతో తవ్వకాలు

అక్రమార్కులు ఇసుకను పడవల ద్వారా వెలికిస్తున్నారు. ఇందుకుకోసం రెండు పెద్ద పడవలను సమకూర్చుకున్నారు. ఇందులో ఇసుకను తీయడానికి పైపులు ఉంటాయి. పడవల్లో ఇసుక ఎక్కువ నిల్వ ఉన్న నది ప్రాంతంలోకి డీజిల్ ఇంజిన్, పైపుల ద్వారా ఇసుకను పడవల్లోకి వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఒక్కో పడవలో ఒకటిన్నర ట్రాక్టర్ ఇసుక వస్తుంది. నదిలో రెండు నుంచి మూడు మీటర్ల లోతు నుంచి ఇసుకను పైకి లాగుతున్నారు. ఇలా తీసుకొచ్చిన ఇసుకను సన్నగా మార్చడానికి నదిలో ఇసుకపట్టే జాలిని ఏర్పాటు చేశారు. పడవల ద్వారా తీసుకొచ్చిన ఇసుకను జాలీలో పోసి నాణ్యమైనదిగా మార్చుతారు. ఇసుకను టిప్పర్లలో ఎత్తిపోయడానికి జేసీబీలను అందుబాటులో ఉంచారు. జేసీబీల ద్వారా టిప్పర్లలో అక్రమంగా రవాణా చేస్తున్నారు.

### ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు..

ఇసుక క్వారీలకు అవకాశం లేదని నదీ పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తే రైతులు, స్థానికులకు నష్టం జరుగుతుందని భూగర్భ జల వనరుల శాఖ అధికారులు గతంలో ప్రభుత్వానికి నివేదికలు పంపారు. నదీ పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను తొడితే భూ గర్భజలాలు ఇంకిపోతాయని, రైతులకు సాగునీటి సమస్యలు ఎదురవుతాయని, వాటర్ బాడీస్‌కు ఎండిపోయే ప్రమాదం ఉందని సూచించారు. ఇసుక క్వారీలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయలేదు. జిల్లాలో ఇసుక క్వారీలు లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. నదీలో వాహనాలు వెళ్లడానికి దారిని కూడా ఏర్పాటు చేసుకున్నారు.

### బేల టూ మహారాష్ట్ర

బేల మండలం కాంగార్‌పూర్ పెన్‌గంగా నది నుంచి మహారాష్ట్రకు భారీగా ఇసుక తరలుతున్నది. శంకర్‌గూడ మీదుగా కోర్బానా, వణి ప్రాంతాలకు చేరవేస్తున్నారు. పడవల ద్వారా ఇసుక తీసి ఒక్కో టిప్పర్‌కు రూ.24 వేలు తీసుకుంటున్నారు. మహారాష్ట్రలో ఒక్కో టిప్పర్ ఇసుక ధర రూ.60 వేల వరకు పలుకుతుండగా అక్రమార్కుల వ్యాపారం మూడు నదులు, ఆరు టిప్పర్లుగా కొనసాగుతున్నది. ఒక్కో వాహనం రవాణా చేస్తే రూ.30 వేల వరకు మిగులుతాయని ప్రచారం ఉంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఇటీవల బేల మండలవాసులు తహసీల్దార్, పోలీసులకు వినతిపత్రాలు అందజేశారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్య లు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాంగార్‌పూర్ పెన్‌గంగా నుంచి అక్రమ రవాణా విషయంలో బేల తహసీల్దార్‌ను రఘునాథ్‌రావును వివరాలు అడుగగా నదిలో ప్రస్తుతం నీళ్లు ఉన్నాయని ఎలాంటి తవ్వకాలు జరగడం లేదన్నారు.



చీకట్లోనే శోభాయాత్రగా సరస్వతీ అమ్మవారి కోనేరుకు వెళ్తున్న మహిళలు

# చీకట్లోనే బతుకమ్మ సంబురాలు

బాసర, అక్టోబర్ 3 : బాసరలో గురువారం బతుకమ్మ వేడుకలను మహిళలు నిర్వహించారు. తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను అందులో ఉంచి పూజించారు. రాత్రి ఒక్కసారిగా గాలి దుమారం రావడంతో విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో మహిళలు చీకట్లోనే శోభాయాత్రగా సరస్వతీ అమ్మవారి కోనేరుకు చేరుకుని బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి..



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 3 : ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. నిర్మల్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్వో కిరణ్‌కుమార్, వ్యవసాయ అధికారి అంజీప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఎదులాపురం, అక్టోబర్ 3 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం సచివాలయం నుంచి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కలెక్టర్లు పూర్తి బాధ్యతతో సజావుగా కొనుగోలు జరిగే విధంగా చూడాలన్నారు. దొడ్డు, సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. మద్దతు ధరతోపాటు సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 అదనంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా అధికారులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాల మేరకు మెరిట్ ఆధారంగా అర్హత సాధించి, ఎంపికైన ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని శనివారం వరకు పూర్తి చేయాలని సూచించారు. ఎంపికైన ఉపాధ్యాయులకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్ పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో తేమ శాతం పెంచాలి..



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎదులాపురం, అక్టోబర్ 3 : పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), ప్రైవేటు వ్యాపారులు తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకుని రైతులను ఇబ్బందులు పెట్టవద్దని సూచించారు. వానకాలంలో రైతులు సాగు చేసిన పత్తి కొనుగోళ్లకు సంబంధించి గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన వివిధ శాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 8 నుంచి 12 శాతం తేమ నిబంధనల కారణంగా రైతులు నష్టపోతారని తెలిపారు. సీజన్ ప్రారంభంలో పంటలో కొంత తేమ ఉంటుందని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. బోథ్ నియోజకవర్గంలోని అన్ని మార్కెట్ యార్డుల్లో రైతులు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని, వారికి భోజన వసతి కల్పించాలని సూచించారు. సీసీఐ అధికారులు టార్గెట్ పేరిట తక్కువ పత్తిని కొనుగోలు చేయకుండా రైతులు తీసుకొచ్చిన పంటను సేకరించాలని కోరారు. ధర, తూకం, నాణ్యత పేరిట ఇబ్బందులు పెట్టవద్దన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు, అదనపు కలెక్టర్ శ్యామలదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

# కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు

- జిన్నింగ్ మిల్ యజమానులు, రైతు సంఘాల నాయకులతో సమావేశం
- కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, అక్టోబర్ 3 : పత్తి కొనుగోళ్లలో గతంలో జరిగినవి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, అసౌకర్యాలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మార్కెటింగ్ సీజన్ 2024-25 పత్తి కొనుగోళ్ల సన్నద్ధత, ముందస్తు ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, అధికారులు, జిన్నింగ్ మిల్ యజమానులు, రైతు సంఘాల నాయకులతో కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అదనపు ఎస్పీ సురేందర్, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్‌లతో కలిసి ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521, నాణ్యత ప్రమాణాలు పాటించి 8 శాతం తేమ మించకుండా పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. అదిలాబాద్ అర్బన్, రూరల్, సోనాల, నేరడిగొండ, పొచ్చెర, ఇంద్రవెల్లి, నార్నూర్, ఇచ్చోడ, బేల మండలాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# నిషేధిత పదార్థాలను విక్రయిస్తే చర్యలు

- నిర్మల్‌లో భారీగా క్లోరల్ హైడ్రేడ్ పట్టివేత
- రూ.43 లక్షల విలువ చేసే సామగ్రి సీజ్



స్వాధీనం చేసుకున్న క్లోరల్ హైడ్రేడ్, అల్ఫ్రాజోలం

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 3 : నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ సూపరింటెండెంట్ ప్రదీప్ రావు అన్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసింగ్ ఆదేశాల మేరకు నిర్మల్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ బృందం సభ్యులు దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు నిర్మల్ పట్టణంలోని ద్వారకానగర్ కాలనీలో గందం శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో దాడులు నిర్వహించారు. 3.30 కిలోల అల్ఫ్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా శాంతినగర్ కాలనీలోని ఓ ఇంట్లో 26 బస్తాల్లోని 728 కిలోల విలువ చేసే క్లోరల్ హైడ్రేడ్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.43 లక్షలు ఉంటుందని తెలిపారు. క్లోరల్ హైడ్రేడ్‌ను మహారాష్ట్రలోని సోలాపూర్ శ్రీను వద్ద, అల్ఫ్రాజోలంను రాజస్థాన్‌లోని రూప్ సింగ్ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో స్టేట్ ఎక్సైజ్ ఎస్సై బాలరాజు, సీఐ లక్ష్మణ్‌రావు, ఎస్సై వసంతర్‌రావు, అభిషేక్ ఉన్నారు.

# సర్టిఫికేట్ ప్రక్రియ ప్రారంభం

ఎదులాపురం, అక్టోబర్ 3 : జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో గురువారం డీఎస్సీ అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికేట్ల ప్రక్రియను కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఎనిమిది కమిటీల ద్వారా ఎస్ఏ, ఎస్జీటీలకు వేరువేరుగా కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డీఎస్సీలో అర్హత సాధించిన వారికి ఈనెల 5వ తేదీ వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ కొనసాగుతుందన్నారు. దాదాపు 299 మంది అభ్యర్థులు రానున్నారని తెలిపారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన పీఆర్టీయూ అధ్యక్షుడు కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఇందులో డీఈవో ప్రణీత, అధికారులు ఉన్నారు.

### పకడ్బందీగా నిర్వహించాలి..

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోహార గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా తొలి రోజు సర్వేను నిర్వహించారు. కలెక్టర్ గ్రామంలో పర్యటించి జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌కు పలువురు వారు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ సర్వేలో ఆర్డీవో వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులున్నారు.